# అపర్ణ

రైలు వేగంగానే వెళ్తోంది.. కానీ నాకెందుకో చాలా నెమ్మదిగా వెళ్తున్నట్టనిపిస్తోంది.

చేతి వాచీ చూసుకున్నాను... పద కొండున్నర

కంపార్ట్‌మెంట్‌లో చాలామంది గాఢంగా నిద్రపోతున్నారు... ఇద్దరు కుర్రాళ్లు పేకాట ఆడుకుంటున్నారు. దాదాపు లైట్లన్నీ ఆర్పేశారు. వాళ్లిద్దరూ ఒక్క లైటు వేసుకుని కూర్చుని ఆడుకుంటున్నారు.

నేను కిటికీ లోంచి బైటకి చూడసాగాను.. విశాలమైన మైదానాలు, పెద్ద పెద్ద చెట్లు చీకట్లో తమాషాగా కనిపిస్తున్నాయి. చీకటిని చూడగానే నా గుండె గుభిల్లుమంది. అపర్ణ... అపర్ణ! ఏం చేస్తోందో! జరిగిన ఘోరం తల్చుకుని, తల్చుకుని ఏడుస్తోందా? అపర్ణా నా మనసు బాధగా మూలిగింది. ఒక్కగానొక్క కూతుడు మావయ్యకి... ఆమె మీద, ఆమె భవిష్యత్తు పట్ల ఎన్ని ఆశలు పెట్టుకున్నాడు మావయ్య.... ఎన్నెన్ని కలలు కన్నాడు!

ఆడపిల్లకి అందం లేకపోతే బతుకు దుర్భరం అంటారు.. కానీ అందంగా ఉన్న అపర్ణ బతుకు మరి ఇలా ఎందుకైంది? ఆడపిల్లకి అందం శాపం... అవును ముఖ్యంగా ఈ రోజుల్లో అందం శాపమే.

శివా!

నీకీ వార్తరాయాల్సి వస్తున్నందుకు నా గుండె ముక్కలవుతోందిరా.. నా చేతులు ముందుకు కదలడానికి మొరాయిస్తున్నాయి. ఇదంతా ఓ కల అయితే బాగుండు అని నా మనసు వేయి గొంతులతో ఆక్రోశిస్తుంది... కానీ, కానీ ఇది కల కాదు... నిజం... భయంకరమైన నిజం. మనం ఎవరమూ భరించలేని నిజం అవునురా శివా! నీకు గుర్తుందా? చిన్నప్పట్నించీ అపర్ణకీ చీకటంటే భయం... రాత్రిళ్లు కరెంటుపోతే అమ్మా, నాన్నా, శివా అంటూ కేకలు పెట్టేది. అగ్గిపుల్ల వెలుగు కనిపించినా చాలు హమ్మయ్య అంటూ ఊపిరి

పీల్చుకునేది... నా కళ్లు చీకటిని చూడలేవు శివా అని నీతో అంటూ ఉండేది. అలాంటి అపర్ణ భవిష్యత్తంతా అంధకారం అయిపోయిందిరా... ప్రేమ పవిత్రమైంది. ప్రేమలో దైవత్వం ఉంది అని అన్న వాళ్ళని ఎక్కడున్నా వెతికి తీసుకొచ్చి అపర్ణని చూపించి ప్రేమ దారుణమైంది.. ప్రేమలో రాక్షసత్వం ఉంది అని గొంతెత్తి అరిచి చెప్పాలని ఉంది... లేకపోతే ఏంటిరా? ప్రేమించినవాడు ఇలాగేనా దానిమీద ప్రతీకారం తీర్చుకునేది, నేనూ ప్రేమించానురా ఒకప్పుడు, నా ప్రేమ కూడా ఫలించలేదు. మా కాలంలో ప్రేమలో త్యాగమే కానీ, ప్రతీకారం ఉండేది కాదు. ఈనాడు ఎందుకురా ప్రేమ కూడా హింసతో కూడుకుని వుంటోంది?

''మావయ్యా!'' బాధగా గొణుకున్నాను.. ఎంత బాధపడుతున్నాడో! ఒక్కగానొక్క కూతురు... దాని బతుకు ఇలా ముక్కలైతే మావయ్య ఆవేదన ఎవరు తీర్చగలరు? ఆ తల్లిదండ్రుల శోకం ఎవరు ఆపగలరు?

''శివా! నీతో పాటు రాత్రిళ్లు అపర్ణని కూడా కూర్చోబెట్టి చదివించు.. పుస్తకం ముట్టుకుంటే చాలు దానికి నిద్రవస్తుంది. ఎలాగైనా దానికి ఎమ్సెట్లో ర్యాంకు రావాలి... అది డాక్టరవ్వాలి... నా చిరకాల వాంఛ. నేను ఎలాగా కాలేకపోయాను నా కూతురైనా డాక్టరవ్వాలి... కాస్త భయపెట్టి చదివించరా'' అత్తయ్య స్వరం నా చెవుల్లో గింగురుమంది.

చేతిలో అప్పడాల కర్ర పట్టుకుని బెదిరిస్తూ, బుజ్జగిస్తూ చదివించాడు

అమ్మా, నాన్న, తోబుట్టువులు లేని నన్ను కంటిపాపలా పెంచి పెద్దచేసి ఇంతవాడిని చేసిన మావయ్యకీ, అత్తయ్యకీ నేను ప్రాణాలైనా ఇవ్వడానికే సిద్ధపడ్డాను.. నా చదువు పక్కనపెట్టి అపర్ణని బాగా చదివించాను. అందుకే నేను ఎం. ఎ తో చదువాపేసి, గుంటూరులో లెక్చరరునైనాను.. అపర్ణ హైదరాబాద్ మెడికల్ కాలేజీలో ఎం.బి.బి.ఎస్ లో చేరింది. నాలుగేళ్ళ చదువూ గంగలో పోసినట్టేనా?

భగవంతుడా! జుట్టు పీక్కున్నాను.

ఈ రైలింత నెమ్మదిగా వెడుతోందేంటి? అపర్ణ జీవితంలో జరగదాని దారుణం జరిగి ఇప్పటికే నెలదాటింది. పోస్టల్ సమ్మె కారణంగా మావయ్య ఉత్తరం అందేప్పటికీ ఆలస్యం అయింది. తీరా సమ్మె విరమణ జరిగి ఉత్తరం నాకు చేరేటప్పటికీ నేను ఊరికి వెళ్లాను బాబాయి హాళ్ల పొలం అమ్మకానికి

పెట్టారని తెలిసి.. నేను దగ్గర లేకపోతే ఆ పొలం విషయంలో కూడా నాకు అన్యాయంచేస్తారని, నాకంటూ కొంతన్నా ఆస్తి ఉంటే అపర్ణ పెళ్లికి ఆడపడుచు పసుపుకుంకాల కింద నా పొలం బహుమతిగా ఇవ్వాలని నా కోరిక, కానీ, కానీ దుఃఖం ఆగలేదు. నాకు స్వంత బాబాయిలు అమ్మా, నాన్న పోయాక తనకి అన్యాయం చేసినా, మావయ్య, అత్తయ్య చేరదీసి ఆశ్రయం ఇచ్చారు. మావయ్య ఏమనుకుంటున్నాడో! విషయం తెలిసి ఇంతకాలమైనా నేను రాలేదని కృతఘ్నుణ్ణి అనుకుంటున్నారా? ఏరుదాటాక తెప్ప తగలేశాడని నిందిస్తున్నారా? ఉద్యోగస్తుడైనాడుగా ఇంక మనం ఎందుకు గుర్తుంటాం! అని నిష్టూరాలాడుతున్నారా?

''లేదు. మావయ్యా! నిజంగా నేరం నాది కాదు పోస్టల్ వాళ్లది. వస్తున్నాను మావయ్యా నా కళ్లతో అపర్ణకి ఈ ప్రపంచాన్ని చూపిస్తాను నా మాటలతో ఆమె జీవితంలో వెలుగు నింపుతాను. నన్ను నమ్ము మావయ్యా.

దూరంగా ఓ చిన్న వెలుగు కనిపిస్తోంది. ఏదో చిన్నస్టేషన్ వస్తోంది అబ్బ ఇక్కడ ఎంతసేపు ఆగుతుందో ఈ రైలు. విసుగ్గా అనుకున్నాను. స్టేషన్ సమీపించి దూరమైంది.. హమ్మయ్య రైలాగలేదు.

వెలుగు క్రమంగా దూరమైంది. మళ్లీ చీకటి... చీకటిని చూస్తోంటే జీవితంలో మొదటిసారిగా భయం వేస్తోంది.. గుండెల్ని కలచేస్తున్నట్లుగా ఉంది... చీకటి.. నో! ఈ చీకటిని చూడలేను చటుక్కున జేబులోంచి సిగరెట్టు తీసి వెలిగించాను. ఆ క్షణంలో మిణుకు, మిణుకుమంటూన్న, వెలిగీ వెలగని సిగరెట్టె కోటి సూర్యప్రభల్లా కనిపించింది.

అపర్ణా ఏం చేస్తున్నావమ్మా జరిగినదంతా తలుచుకుని, కుమిలిపోతున్నావా? ఇంక బతికి ఏం చేయాలి అని నిరాశపడుతున్నావా?

కళ్లు లేకపోతేనేం అపర్ణా నేనున్నాను... అమ్మ ఉంది... నాన్న ఉన్నాడు ఈ సుందర విశాల ప్రపంచం ఉంది. గుడ్డి వాళ్లెందరో విద్వాంసులున్నారు, మేధావులున్నారు. గుడ్డిదాన్ని అయ్యానని బాధపడకు. నీ అందమైన కళ్ల మీద నిర్దయగా యాసిడ్ పోసిన ఆ నీచుడి చేతులు తెగనరికి నీ భవిష్యత్తుకి పునాదులు వేస్తాను. నన్ను నమ్ము నా శరీరం నిలువెల్లా కంపించింది నా గుండె భగ్గున మండింది.. అంత చలిలోనూ నా అణువణువూ కాలుతున్నట్టుగా అనిపించింది. కాలేజీలో చేరిన కొత్తల్లో అపర్ణ రాసిన ఉత్తరం గుర్తొచ్చింది.

శివా!

నీకో విషయం చెప్పనా? మా కాలేజీలో ఓ ప్రేమ పూజారి ఉన్నాడు.. నన్ను ప్రేమిస్తున్నాట్ట... తన ప్రేమ అంగీకరించకపోతే చచ్చిపోతాట్ట.. హాయిగా పొమ్మన్నాను.. ఎలా ఉంటాడో తెలుసా! ఎత్తు పళ్ళు, చింపిరిజుట్టు, చాలా అసహ్యంగా అంకుల్‌లా ఉంటాడు.. వాణ్ణి నేను ప్రేమించాలట.. రోజూ కాలేజి నుండి ఇంటి దాకా సెక్యూరిటీ గార్డు లాగా వస్తాడు.. కాలేజీలో డేగ కళ్ళతో కాపలా కాస్తుంటాడు. పూర్ ఫెలో! ప్రేమంటే అర్థం తెలీని వాళ్ళంతా ప్రేమ కబుర్లు చెప్పేవాళ్ళే శివా! ఆడపిల్ల ప్రేమ పొందాలంటే ఏం చేయాలో, ఎలా ప్రవర్తించాలో చాలా మందికి తెలీదు.. రక్తంతో ఉత్తరాలు రాస్తే అమ్మాయి హృదయంలో ప్రేమబీజాలు నాటుకుంటాయా? ఆడపిల్ల హృదయాన్ని స్పందింపచేసి, అనురాగామృతం నింపగలగటం ఓ కళ... అది అందరికీ చేతనవుతుందా చెప్పు ఏమిటో పిచ్చివాడు.. అతడిని చూస్తుంటే జాలేస్తుంది... ఎంత కష్టపడి చదివి సీటు సంపాదించాడోగాని, డాక్టరు అవుతాడని నమ్మకం నాకు లేదు.

వాడు ప్రేమ పూజారి కాదు అపర్ణా! శాడిస్టు... ఉన్మాది.. నీచుడు... కాముకుడు వాడికి నీ మీద ఉన్నది ప్రేమ కాదు.. కోరిక, మోజు నిజమైన ప్రేమికుడు నీ సుఖాన్ని సంతోషాన్ని కోరుకుంటాడు. కానీ వీడిలా రాక్షసంగా ప్రవర్తించడు. నాకు తెలీకుండానే నా గుప్పిళ్ళు బిగుసుకున్నాయి.. పళ్ళు పటపటలాడాయి.

శివా!

ఆ దుర్మార్గుడిని పోలీసులు పట్టికెళ్ళారు...

కానీ ఏం చేస్తారు? ఏడాదో, రెండేళ్ళో శిక్షవేసి, వదిలేస్తారు కానీ, కానీ నా బంగారుతల్లికి యావజ్జీవ శిక్ష పడిందిరా

మావయ్య ఉత్తరంలోని అక్షరాలు నా కళ్ళ ముందు కదిలాయి.

మావయ్యా! నిలువెల్లా వణికిపోయాను. తల విదిలించి బైటకి చూశాను..

అర్ధరాత్రి దాటినట్టుంది. ప్రకృతి నిద్రలో మునిగినట్టుగా వుంది నిశ్శబ్దంగా.. ఆ నిశ్శబ్దంలో రైలు శబ్దం విషాధ నేపథ్యంలా ఉంది.

కళ్ళు మండిపోతున్నాయి... మెల్లగా కళ్ళు మూసుకున్నాను. మగతగా, మెలకువగా, మెలకువా, నిద్రా కాని అవస్థ.. కళ్ల ముందు అపర్ణ, గౌనులో, పరికిణీ, జాకెట్టుతో, ఓణీతో, చీరతో, పంజాబీసూటుతో గల గలా గోదారిలా సుళ్లు తిరుగుతూ, సెలయేరులా చెంగున దూకుతూ, అందంగా నవ్వుతూ, ఆడుతూ, పాడుతూ పరిగెత్తుకొస్తూ అరె మధ్యలో ఏంటది? ఏమయింది అపర్ణకి? హఠాత్తుగా చీరచెంగు మెడకి చుట్టుకుని బిగించుకుంటోంది.. అపర్ణ అందమైన కళ్లు తేలిపోతున్నాయి. మొహంలో ప్రేతకళ అపర్ణా! ఉలిక్కిపడి కళ్లు తెరిచాను.

నో! నో! ఇలా జరక్కూడదు.. అపర్ణ ఆత్మహత్య చేసుకుంటుందా? నేను కూడా సమయానికి దగ్గర లేకపోవడంతో బాగా డిప్రెషన్‌కి లోనై ఉంటుంది అపర్ణా! నా గుండెగొంతు చించుకుంది. అయినా రైలు నెమ్మదిగానే వెళుతోంది అనిపిస్తోంది.. దానిక్కారణం నా మనసు రైలుకన్నా అత్యంత వేగంగా అపర్ణ దగ్గరికి వెళ్లిపోయి, నా కోసం ఎదురు చూస్తోంది.

హమ్మయ్య రైలాగింది.

సికింద్రాబాదు స్టేషన్‌లో హడావుడి, గందరగోళం, కేకలు, అరుపులు అన్నీ దాటుకుని, అన్నిటినీ వదులుకుని పరుగులు... నా పరుగులు చూసేమో ఆటో వాలా డబల్ రేటు అడిగాడు. కిమ్మనకుండా కూర్చున్నాను. ట్రాఫిక్ సిగ్నల్స్, వాహనాల రద్దీ, కిక్కిరిసిన జనసందోహం దాటుకుని ఆటో పద్మారావు నగరు సమీపించింది.

ఒక్క ఉదుటున దిగాను. చేతిలో సూటుకేసు వణుకుతోంది. వణుకుతూనే గేటు తోశాను. వాకిట్లో ధనుర్మాసం ముగ్గు కాంతులీనుతోంది. సూర్యరశ్మి మీదపడి... ముందు వరండాలో మావయ్య కుర్చీలో కూర్చుని పేపరు చదువుతున్నాడు.

కంపిస్తున్న స్వరంతో పిలిచాను మావయ్యా!

మావయ్య పేపరులోంచి తలెత్తి చూశాడు. ఆయన కళ్లల్లో లిప్తపాటు సంతోషం మెరిసి మాయమై విషాదం నిండిపోయింది... మౌనంగా చేతులు చాచాడు. నా చేతిలో సూట్‌కేసు జారిపోయింది... పరుగునవెళ్లి ఆయన చేతుల్లో వాలిపోయి బావురుమన్నాను... మావయ్య ఓ చేత్తో ఓదార్పుగా నా వీపు తడుతూ మరో చేత్తో కళ్లు తుడుచుకున్నాడు.

''నేను ఊళ్లోలేను మావయ్యా... పోస్టల్''..

''నాకు తెలుసురా.. వార్త అందితే ఆగగలవా? రెక్కలు కట్టుకుని వాలవా?

అపర్ణ... అపర్ణ.. ఎ.. ఎలా

నా ప్రశ్న గొంతులోనే నిలిచిపోయింది.

లోపలి నుండి అపర్ణ తీయని స్వరం...

ప్రకృతిని పులకింపచేస్తూ, చెట్లను చిగురింపచేస్తూ

''ఉదయగిరిపైన, అదిగో గగనాన, కదలి దినరాజు తేరు, పొదిగి చిరుగాలి, నిదుర తెరజారి, కదలి కోనేరు''

నా కాళ్లు అప్రయత్నంగా ముందుకు కదిలాయి..

లోపల చాపమీద అపర్ణ, ఆమె ఒడిలో వీణ. తల్లి ఒడిలో పడుకున్న పసిపాపలా... అపర్ణ మొహం అందంగా, అద్భుతంగా కనిపిస్తోంది. ఆత్మవిశ్వాసం, మనోధైర్యం రెండు కళ్లయి ఆమెకి కొత్త అందాన్ని ఆపాదిస్తున్నాయి.

నేను కదిలే శిలలా, అడుగులో అడుగు వేసుకుంటూ అపర్ణ దగ్గరికి నడిచాను... ఇప్పుడు నా మనసెంతో తేలిగ్గా, హాయిగా ఉంది, నా అడుగుల్లో బలం చేకూరింది. అపర్ణని సమీపించాను.

అపర్ణా!

శివా! అపర్ణ చేతివేళ్లు, వీణ తీగల మీద నుండి జరిగి నా చేతుల కోసం తడుముతున్నాయి. నా చేయి అందిచ్చాను. అపర్ణ గుండెల్లోంచి సన్నగా, తృప్తిగా, నిట్టూర్పు శబ్దం వినిపించింది.